# స్వేద ముత్యం

కాకినాడ నుంచి తుని పోయే ఆర్.టి.సి. బస్సు పండూరు జంక్షనులో ఆగింది. పాతిక ముప్ఫైమంది జనం పొలోమంటూ బస్సులోకి జొరబడ్డారు. అప్పటికే బస్సులోని సీట్లన్నీ నిండిపోయి ఉన్నాయి. ఎక్కిన జనం బస్సు ఈ చివర నుంచి ఆ చివరి వరకూ తోసుకుంటూ, తొక్కుకుంటూ నిలబడ్డారు. ఇంకా కొందరు బలవంతంగా ఎక్కబోతూంటే కండక్టరు 'ధన్'మని తలుపు మూశాడు.

బస్సు కదలింది. కండక్టరు జనాన్ని తప్పించుకుని బస్సు చివరకు నడిచి టిక్కెట్లు ఇవ్వడం మొదలుపెట్టాడు.

బస్సంతా గోల గోలగా ఉంది.

నేను కిటికి పక్క సీట్లో కూర్చున్నాను. సాయంత్రం అయిదున్నర...!

ఆకాశం నిండా ఆషాడమేఘాలు ముసురుకుని ఉన్నాయి. వారం రోజులుగా ఒకటే వర్షం జల్లులు జల్లులుగా కురుస్తూనే ఉంది. రోడ్డుకిరువైపులా పొలాలన్నీ జలమయంగా ఉన్నాయి. అక్కడక్కడా పొలాల్లో నాట్లు పడుతున్నాయి.

"ఏయ్ పిల్లా! ఏ ఊరు వెళ్తావు - టిక్కెట్టు తీసుకో" కండక్టరు గొంతు కర్కశంగా ధ్వనించింది.

" మా అయ్య... అల్లెక్కడో ముందల నిలబడినాడండి" ఆ పిల్ల బెరుకుగా సమాధానం చెప్పింది.

" మీ అయ్య అక్కడ నిలబడితే, నువ్వెందుకిక్కడ తగలడ్డావ్? సరే,సరే, ఎవరయ్యా ఈ పిల్లతాలూకు మనుషులు?" టికెట్... టికెట్... కండక్టరు టిక్కెట్లు కొడుతూ ముందుకు పోయాడు.

యాధాలాపంగా ఆ పిల్లవైపు చూశాను. వయస్సు పది పన్నెండేళ్ళ మధ్య ఉండొచ్చు. దరిద్రానికి ప్రతినిధిలా ఉంది. మాసిన పరికిణీ, చిరుగుల జాకెట్టు, చేతిలో సత్తు కారియరు. అమాయకంగా అటూ ఇటూ చూస్తోంది.

కొందరు పిల్లల్ని చూస్తే ఎందుకో జాలిలాంటి భావం కలుగుతుంది. మనసు మంచులా కరుగుతుంది. ఆ అమ్మాయిని చూస్తే నాకు అలాగే అనిపించింది. సరి అయిన తిండి, పోషణ, శుభ్రత కరువైన భావిభారత పౌరులు కోకొల్లలు కదా మన కళ్ళముందు.. మనసును సరిపుచ్చుకున్నాను... మళ్ళీ బయటికి చూశాను. బస్సు కిటికీలోంచి లోపలకు వర్షం తుంపరులుగా పడుతోంది.

ఏ కొండల గుండెలపై నుంచో పరుగెత్తి పడగెత్తి ఎర్రదనాన్ని నింపుకున్న వరదనీరు నిండుగా కాలువల్లో ప్రవహిస్తోంది. వరదనీటిని చూసి వెర్రెత్తి పోతున్నట్లుగా కొంగలు, కాకులు గిరికీలు కొడుతూ ఎగురుతున్నాయి. దూరంగా రెండు ట్రాక్టర్లు - దడదడమని శబ్దం చేస్తూ పొలాల్ని దున్నుతున్నాయి. జలమయ పొలాల్లో జట్లు, జట్లు ఒంగి నాట్లు వేస్తోన్న ఆడ కూలీలు

జానపద గీతాలు ఆలాపిస్తున్నారు. ఏదో ఆనందం భావత నీళ్ళాడుతోన్న అనుభూతి.

" ఏయ్‌పిల్లా! ఏడీ మీ అయ్య ఎక్కడ?'' కండక్టరు - కంఠం వినిపించటంతో చటుక్కున తల తిప్పాను.

" ఏడీ మీ అయ్య? ఎవరి తాలూకు నువ్వు?'' కండక్టరు - గదమాయించి అడుగుతున్నాడు.

ఆ పిల్ల బిక్కముఖం వేసింది. భయంతో మెడ ముందుకు సారించి తండ్రిని, తల్లిని ఆ జనంలో గొంతెత్తి పిలుస్తోంది... ఎవరినుంచీ సమాధానం లేదు.

కండక్టరు ఆ పిల్ల రెక్క పట్టుకుని ముందుకు లాక్కొని వెళ్ళాడు. " ఏదీ చూపించు... మీ అయ్యనీ, అమ్మనీ."

ఆ పిల్ల ముందుకు చూసింది. వెనక్కి చూసింది బస్సులో జనం అందరూ ముఖాలూ పట్టి పట్టి చూసింది. గొల్లుమని ఏడుపు లంకించుకుంది.

కండక్టరుకు చికాకు ఎక్కువైంది. " ఈ పిల్ల తాలూకు మనుషులు ఎవరైనా బస్సులో ఉన్నారా?'' అంటూ గట్టిగా కేక పెట్టాడు. ఎవరూ పలకలేదు.

అప్పటికే బస్సు చిత్రాడ రైల్వేగేటు దాటి పిఠాపురం పొలిమేరల్లోకి ప్రవేశించబోతోంది. కండక్టరు టంగుమని బెల్ కొట్టాడు. బస్సు ఆగిపోయింది.

బస్సులో కలకలం. ఆ పిల్ల ఎవరి తాలూకో తల్లీ దండ్రీ ఎవరో...? వాళ్ళుపండూరు జంక్షనులో బస్సు ఎక్కలేక మిగిలిపోయారేమో! ఈ పిల్ల కంగారుపడి ముందుగా ఎక్కేసి ఉంటుంది. ఏమిటి చెయ్యడం?

"మీ వాళ్ళెవరూ బస్సులో లేరు. బస్సు దిగిపో'' కండక్టరు కసిరినట్టుగా ముందుకుతోశాడు. ఆ పిల్ల ఏడుపు మరింత పెద్దది చేసింది. " ఏడవకు తల్లీ ! నిన్నెవరూ కొట్టలేదిప్పుడు.'' కండక్టరు మరింత ఘండిపడ్డాడు.

నేను సీట్లోంచి లేచాను. " చూడండి కండక్టరుగారూ ! ఆ పిల్ల బస్సు దిగి ఎక్కడికి పోతుంది? తల్లినీ, తండ్రినీ ఎలా పట్టుకుంటుంది? పోనీ, వాళ్ళ ఊరు వెళ్ళిపోతుందేమో ఏ ఊరో కనుక్కోండి. టికెట్టు తీద్దాం.''

నా మాటలు ఆ పిల్లకు నచ్చాయో, ఏమో ఏడుపు తగ్గించింది.

" చూడు పాపా ! నీ పేరేమిటి?'' ఆ అమ్మాయిని సౌమ్యంగానే అడిగాడు కండక్టరు.

"ముత్తేలండి.''

"చూడమ్మా ముత్యాలూ, ఏ ఊరు మీది?'' "నెల్లిపూడండి.'' ఆ పిల్ల వెక్కి వెక్కి పడుతోంది.

"అయ్యా అమ్మా ఎక్కడున్నారు?''

" మాలయ్యా అమ్మా, తమ్ముడు అందరం అల్లక్కడ బస్సు కోసం నిలబడినావండి. నేను ముందల బస్సెక్కినానండి.''

"సరే మరి! నువ్వు వెనక్కి వెళ్ళి మీ అమ్మనీ, అయ్యనీ కలుసుకుంటావా? ఒక్క

దానివీ నువ్వు మీ ఊరెళ్ళిపోతావా?"

" మా ఊరెల్లిపోతానండి. కత్తిపూడిలో దిగి నెల్లిపూడి నడిసి పోతానండి."

మీ అయ్యా అమ్మా నీకోసం పండూరు జంక్షనులో వెదుక్కుంటారేమో?"

"మా వోల్లు న న్నెదుక్కుంటూ ఎనకాల బస్సులో ఒచ్చేత్తారండి."

ముత్యాలు ధైర్యానికి నాకు ముచ్చటేసింది. ఆ పిల్ల ముఖంలో మొదట్లో ఉన్న భయం, ఏడుపు, పిరికితనం ఇప్పుడు మచ్చుకైనా లేవు. కత్తిపూడికి టిక్కెట్టు మూడు రూపాయలని కండక్టరు చెప్పాడు. నేను జేబులో చేయి పెట్టాను. నన్ను చూసి నలుగురైదుగురు పావలాలు, అర్థలు నా చేతికందించబోయారు. ఆ చిల్లర వద్దని నేను కండక్టరు దగ్గర టిక్కెట్టు తీసుకుని ముత్యాలు చేతిలో పెట్టాను. బస్సు బయలుదేరింది.

ఒక సమస్య తీరిందని నా మనసు తృప్తిగా నిట్టూర్చింది. నేను నా సీట్లోకి వచ్చి కూర్చున్నాను.

ముత్యాలు అక్కడే నిలబడింది. మిగతా ప్రయాణికులు ఎవరే ప్రశ్నలు అడిగినా, ఆ పిల్ల జవాబు చెప్పటంలేదు. బస్సు పిఠాపురం దాటి గొల్లప్రోలు చేరింది. గొల్లప్రోలు చెరువు దగ్గర జనం చాలామంది దిగిపోయారు. చీకటి ఎప్పుడో పడింది. బయటి వర్షపు జల్లు మరింత ఎక్కువైంది. బస్సులో సీట్లు ఖాళీ అయి ముత్యాలు ఒక సీట్లో కూర్చుంది.

బస్సు కత్తిపూడి జంక్షను చేరేసరికి ఏడు గంటలు దాటుతుందేమో. నేనూ కత్తిపూడిలోనే దిగాలి. అక్కడ దిగి శాంతి ఆశ్రమం పోయే బస్సును అందుకోవాలి. శాంతి ఆశ్రమానికి సరాసరి వెళ్ళే బస్సు నాకు దొరకలేదు. శాంతి ఆశ్రమం గురుకుల పాఠశాలలో నాకు ఉపాధ్యాయుడుగా పిలుపు వచ్చింది. రేపు ఉదయం పది గంటలకు ఇంటర్వ్యూ. ఎప్పుడూ నేను శాంతి ఆశ్రమం వెళ్ళలేదు. అక్కడి ప్రశాంత వాతావరణం, పరిసరాలు బావుంటాయుట. నియమబద్ధంగా ధార్మికజీవనం గడిపే మనుషుల్నీ, కొండల్నీ, కోనల్నీ, జంతుజాలాన్నీ చూస్తే మరోలోకం వెళ్ళినట్టుగా అనుభూతి కలుగుతుందట. నిజంగా నా కల ఫలించి ఆ ఊళ్ళో ఉద్యోగం దొరికితే అంతకంటే అదృష్టం ఏముంటుంది.?

అనుకున్నట్టుగానే కత్తిపూడి జంక్షనులో బస్సు దిగేసరికి ఏడున్నరైంది.

నాతో ముత్యాలూ బస్సు దిగింది. సత్తు కారియరు ఊపుకుంటూ చీకట్లో ముందుకు వెళ్ళిపోయింది.

సన్నగా చినుకులు పడుతున్నాయి. ఆ జంక్షనులో రోడ్డు పొడవునా లారీలే ఎక్కువగా నిలబడి ఉన్నాయి. జీ.టీ. హైవే రోడ్డు కాబోలు. నేను ఓ కిళ్ళీకొట్టు దగ్గర నిలబడి సోడా తాగాను. సిగరెట్ వెలిగించుకున్నాను. ఎదురుగా కాఫీ హొటలు ముందు తలలో మల్లెపూలు, ముఖానికి ముద్దగా పౌడర్లు ఉన్న ఓ స్త్రీ లారీ డ్రైవరు భుజంమీద చేయి వేసి నవ్వుతోంది. వాళ్ళిద్దర్నీ చూస్తూ బెంచీమీద చతికిలబడ్డ ఎర్రటోపీ తాపీగా బీడీ కాల్చుకుంటోంది.

నేను పక్కకు తిరిగి ఉలిక్కిపడ్డాను. అక్కడ ముత్యాలు. నాకు రెండడుగుల దూరంలో నిలబడి నావైపే చూస్తోంది.

" ఏం ముత్యాలూ, ఇక్కడ ఉండిపోయావేం? మీ అయ్యకోసం, మీ అమ్మకోసం ఎదరుచూస్తున్నావా?' ఆశ్చర్యంగా అడిగాను. " లేదండీ, మా వూరోళ్ళు ఎవరైనా

కనిపిత్తారేమోనని ఎదురుసూత్తన్నానండి."

"కొంచె సేపాగితే, మీ అయ్యా, అమ్మా నిన్ను వెతుక్కుంటూ వస్తారేమో కదా!"

" నాకు అయ్యా , అమ్మా లేరండి."

నేను అదిరిపడ్డాను. ఒక్క క్షణం, ముత్యాలు మాట్లాడుతున్న దేమిటో నా కర్థం కాలేదు." అదేమిటీ? మీ అయ్యా, అమ్మా వెనకాల బస్సులో నన్ను వెతుక్కుంటూ వస్తారని చెప్పావు?"

" నా కాడ డబ్బుల్లేవండి. అందుకే అట్టా అబద్దం సెప్పినానండి. అయ్యా, అమ్మా ఊళ్ళో పొలం గొడవల్లో నా సిన్నప్పుడే సచ్చిపోయినారంటండి.".

నా మనసు నీరైపోయింది. ఎన్నో ఆలోచనలు నన్ను ఒక్కుమ్మడిగా ఉక్కిరిబిక్కిరి చేశాయి. ఏదో చెప్పలేని భావసంచలనం. పదీ పన్నెండేళ్ళ మధ్య వయస్సుంటుందేమో ఈ పిల్లకు. పేరు ముత్యాలు పేదరికం ఆభరణం. తన అవసరం గడుపుకోవడంకోసం ఎంత గడుసరిగా వ్యవహరించింది? ఎంత గొప్పగా నటించింది? ఎంత తెలివి ప్రదర్శించింది? ఎంత తేలికగా అబద్ధం ఆడింది?

అయ్యా అమ్మా, తమ్ముడూ, తనూ పండూరు జంక్షనులో బస్సుకోసం నిలబడ్డాం అంది. బస్సులో ఒరయ్యో, ఓలమ్మో అంటూ కేకపెట్టింది. బిక్కముఖం పెట్టింది. బేలగా ఏడ్చింది. అందరి ప్రయాణికుల్నీ తేలికగానే నమ్మించింది. ఏమనుకోవాలి?

" మామ్మ, తమ్ముడు గుడిసెలో ఉన్నారండి. మామ్మకు కీళ్ళరోగమండి. పన్లో కెల్లదండి. మామ్మకి, తమ్ముడుకీ బువ్వ నేనే పెట్టాలి కదండీ. కులపోళ్ళతో కలిసి పండూరు పొలం పని కెల్తానండి. పెద్దకాపు నువ్వ పన్లోకి పనికిరావు పొమ్మన్నాడండి. సేతిలో డబ్బుల్లేవండి. సీకటడిపోద్దని బయంవేసి బస్సెక్కేసినానండి."

ఇంత చిన్న వయస్సులో నెత్తిన ఎంత బాధ్యత? ఒక వృద్ధురాలికి, తన కంటే వయసున్న చిన్న కుర్రాడికి తన శ్రమతో, స్వేదంతో ఇంత తిండి పెట్టి పోషిస్తోంది ముత్యాలు.

ఎంతమంది ఇలాంటి అభాగ్య బాలకార్మికులు ఈ వ్యవస్థలో? ప్రణాళికలు పరిభ్రమిస్తున్నాయి. ప్రగతి ముందంజ వేస్తోంది. ఎన్నికలు వస్తున్నాయి. నాయకులు మారుతున్నారు. రంగుల రాజకీయాలు. అదిగదిగో భూతలస్వర్గం అంటూ భవిష్యత్తును భూతద్దంలో అందంగా చూపిస్తున్నాయి. దారిద్ర్యరేఖకు దిగువన దరిద్రనారాయణుల శాతం పెరుగుతూనే ఉంది. ఏది గర్వకారణం?

ముత్యాలు బస్సులో అబద్ధ మాడిందంటే ఎవరిదీ తప్పు..? ఎవరు సిగ్గుపడాలి? ఈ వ్యవస్థలో నేనూ భాగస్వామినే, నేను సిగ్గుపడుతున్నాను.

" చూడు ముత్యాలూ! ఇంకెప్పుడూ అలా అబద్ధమాడకు. అవసరం ఎంతటిదైనా, అబద్ధమాడటం చాలా తప్పు."

ముత్యాలు చేతిలో అయిదు రూపాయలుంచాను. అదిగో అప్పుడే శాంతి ఆశ్రమానికి పోయే బస్సు రోడ్డుమీదకు వచ్చి ఆగింది. గబగబా వెళ్ళి నేను బస్సు ఎక్కాను.

బస్సు కదిలినా ఆ పిల్లరూపం నా కళ్ళలో మెదులుతూంది. చిన్న వయస్సులోనే స్వేదం చిందిస్తోన్న ముత్యాలు - ఓ స్వేదముత్యం!

(ఆంధ్రప్రభ 25.10.89)